## నేటి కందం-నేటికి అందం

తహతహలాడుచు పాంథులు
విహరించెడి పగిది యాంధ్ర వీధుల నెల్లన్
సహనముతో నేర్పరచగ
రహదారుల స్కీము వచ్చె రంజన జేయన్ !!

(ప్రజలు సంతోషంగా సురక్షితంగా ప్రయాణం చేసేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ లో రోడ్లను నిర్మించడం,అభివృద్ధి చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించడానికి ప్రభుత్వం కృషి చేయడమే గాక రవాణా సౌకర్య వంతంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

వరుణయాగ శక్తులతో
వాన కురుస్తే కదా బేష్
రందెందుకు రైతులకు
రోజు ఇంకా భలే జోష్.
ప్రాజెక్టుల జలకళలు
పరవళ్ళతో పరిమళమే
నీళ్లులేని దేశమిదా
నిత్య సస్యశ్యామలమే.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 12-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక: 8 పేజీలు:6 వెల: రూ.1/-


## కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం..



న్యూఢిల్లీ, ఆగష్టు 11: కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఇవాళ (మంగళవారం) ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది.

బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళన చేపట్టారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల




హైదరాబాద్, ఆగష్టు 11:పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఈరోజు (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.

తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా నేరుగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ మరింత సరళీకరణ చేస్తున్నట్లు వివరించారు. అధిక దిగుబడి రైతులకు వెంటనే డిజిటల్ జతివశ్రీట అవతీబితిటతిఇజీబివబ ఇస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో నాణ్యత పరీక్ష పరికరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..

కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. రద్దీ, పెండింగ్ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 599 5779, వాట్సాప్ చాట్‌బాట్: 88972 81111లో సంప్రదించాలని సూచించారు. అన్నదాతకు ఎంఎస్పీ ధర అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.






## తెలంగాణ సర్కారు స్కూళ్లలో తనిఖీల పర్వం..

హైదరాబాద్, ఆగష్టు 11:తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, బోధన తీరు, మౌలిక వసతులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆగస్టు 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో తనిఖీలు చేపట్టనుంది. దాదాపు 24 వేల ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించేందుకు 307 అకడమిక్ ప్యానెల్ బృందాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది.

ఈ తనిఖీల్లో తరగతి గదుల్లో బోధన విధానం, పాఠ్య ప్రణాళిక, సిలబస్ పూర్తయిన తీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వంటి అంశాలను పరిశీలించనున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం సామర్థ్యాలను కూడా అంచనా వేయనున్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన విద్యాపరమైన సహకారం అందించడం కూడా ఈ తనిఖీల ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లోని గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపైనా బృందాలు దృష్టి సారించనున్నాయి.

24 వేల పాఠశాలల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన 307 బృందాల్లో 171 ప్రాథమిక పాఠశాలలకు, 38 ప్రాథమికోన్నత పాఠశాలలకు, 98 ఉన్నత పాఠశాలలకు కేటాయించినట్లు సమాచారం. తనిఖీలకు ముందు బృందాలకు మూడు విడతల్లో ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు.

తొలి విడత బృందాలు ఆగస్టు 17 నుంచి, రెండో విడత ఆగస్టు 21 నుంచి, మూడో విడత ఆగస్టు 24 నుంచి పాఠశాలలను సందర్శించనున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బృందాలు రోజుకు రెండు పాఠశాలలను, ఉన్నత పాఠశాలల బృందాలు రోజుకు ఒక పాఠశాలను పరిశీలించేలా ప్రణాళిక రూపొందించారు.

క్షేత్రస్థాయి తనిఖీల అనంతరం ప్రతి పాఠశాలలో గుర్తించిన లోపాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, వసతుల పరిస్థితిపై నివేదికలు రూపొందించనున్నారు. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మొత్తంగా.. ఈ తనిఖీలతో సర్కారు బడుల్లో చదువు, బోధన, వసతుల అసలు పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 11: సిరియా దేశంలో 14 ఏళ్లుగా కొనసాగిన అంతర్యుద్ధానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలకు పాల్పడ్డారనే కేసులో మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్, ఆయన సోదరుడు మహేర్ అసద్‌కు సిరియా కోర్టు గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. ఇదే కేసులో అసద్ బంధువు అతేఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. తీర్పు వెలువడే సమయంలో కోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నజీబ్ ఖైదీ దుస్తులు ధరించి బోనులో నిలబడి ఉండగా న్యాయమూర్తి తీర్పును చదివారు.

2014 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌లోకి ప్రవేశించిన తర్వాత బషర్ అసద్, ఆయన సోదరుడు మహేర్ రష్యాకు పారిపోయారు. ఆ తర్వాత అతేఫ్ నజీబ్‌ను అరెస్టు చేశారు. అనంతరం ఆయనపై విచారణ చేపట్టారు. అసద్ ప్రభుత్వంలో విచారణకు గురైన అత్యున్నత స్థాయి అధికారుల్లో నజీబ్ ఒకరిగా ఉన్నారు.

నజీబ్ సిరియా సైన్యంలో మాజీ బ్రిగేడియర్ జనరల్. 2011లో బషర్ అసద్ పాలనలో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా పనిచేశారు. అక్కడ తిరుగుబాటును అణచివేసిన చర్యల్లో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పూర్తి... ఓటర్ల జాబితాలో కీలక మార్పులు

హైదరాబాద్, ఆగస్టు 11: తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(ూఎఖీ) ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 78.30 శాతం ఫారాల డిజిటలైజేషన్ నమోదు అయినట్లు తెలిపారు. 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించలేకపోయినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో 21.70 శాతం ఫారాలను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించారు.

45.18 లక్షల మంది ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లినట్లు గుర్తించారు. అలాగే 9.22 లక్షల మంది మరణించినట్లు నమోదు కాగా, మరో 11.25 లక్షల మంది అందుబాటులో లేరని లేదా ట్రేస్ కాలేదని అన్నారు. అలాగే, 6.70 లక్షల మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో తెలంగాణలో ూఎఖీ ఎన్యూమరేషన్ అనంతరం ఓటర్ల జాబితాలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 11: తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలి...

### -ప్రధానికి వీహెచ్ లేఖ

న్యూ ఢిల్లీ, ఆగష్టు 11:జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడికి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు.

ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. తెలుగు రాష్ట్రానికి పింగళి వెంకయ్య సేవలను మోదీ ఎందుకు మరచిపోయారో అర్థం కావడం లేదని తెలిపారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు.

'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

## మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 11: హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం ఈరోజు (మంగళవారం) ఓఅఖీఊఖీఆలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ నిర్వహించాలని సూచించారు. తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని మార్గనిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులకు సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై దద్దరిల్లిన పార్లమెంట్




న్యూ ఢిల్లీ, ఆగష్టు 11:రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.

ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు. పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొనసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు.

# చేతిరాత మన గీతను మార్చగలదు తెలుసా !

## (12 ఆగష్టు "ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం" సందర్భంగా)

కుదురుగా, అందంగా చేతిరాత రాయడం ఓ అద్భుత కళ. విలక్షణమైన చేతిరాత ఒక కళాత్మక వ్యక్తీకరణగా, అందమైన అక్షరాల పొందికను వివరించే విజ్ఞానాన్ని "కాలిగ్రఫీ" లేదా "చేతిరాత కళ" లేదా "అక్షర రూపకల్పన" అని పిలుస్తున్నాం. చేతిరాత ఒక ప్రత్యేక నైపుణ్యం. చేతిరాతతో మెళుకువలను తెలుసుకుంటూ, మెరుగుపరుచుకోవడం నిరంతరంగా కొనసాగే ప్రయత్నం. నేటి డిజిటల్ యుగంలో లుక్ కల్చర్ పెరిగి రైటింగ్ కల్చర్ తగ్గుతోంది. చేతిరాత పట్ల అవగాహన పెంచడానికి కార్యశాలలు, ఆన్‌లైన్ కార్యక్రమాలు, కొత్త రాత శైలజలను నేర్చుకోవడం, అందమైన రాత కోసం సాధన చేయడం కొనసాగాలి. సాధారణంగా మంచి చేతిరాతతో పునాది పాఠశాల స్థాయిలోనే జరుగుతుంది. కుదురుగా అక్షరాలు రాయడానికి పాఠశాల స్థాయిలో డబుల్ రోల్ నోట్ బుక్స్‌లో రాయడం నేర్పిస్తారు.

### ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం :

కాలిగ్రఫీ నైపుణ్యం పట్ల ప్రాధాన్యాన్ని అవగాహన పరచడం, చేతిరాతను మెరుగుపరుచుకోవడం, అందమైన చేతిరాత పట్ల ఆసక్తిని కనబరచడం లాంటి ముఖ్యమైన అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏటా ఆగష్టు 2వ బుధవారం రోజు, అనగా 12 ఆగష్టున "ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం (వరల్డ్ కాలిగ్రఫీ డే)" పాటించడం ఒక ఆచారంగా వస్తున్నది. 2017లో 'మ్యాన్యుస్క్రిప్ట్' పెన్ కంపెనీ ప్రారంభించిన ప్రపంచ కాలిగ్రఫీ రోజు, ముఖ్యంగా విద్యాలయాల్లో అందమైన చేతిరాత పోటీలను నిర్వహించడం జరుగుతుంది. చేతిరాత ప్రక్రియలో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రశంసించడం ఒక మంచి సాంప్రదాయం. అక్షరాలకు సొగసులు అద్దడం, చూపరులను బుట్టలో వేసుకోవడం, విలక్షణ ఆకర్షణను జోడించడం అందరి వల్ల కాదు. అది ఒక ప్రత్యేక నైపుణ్యం అని గుర్తించాలి.

### కాలిగ్రఫీ ప్రయోజనాలు ఎన్నో.. :

కాలిగ్రఫీ అంటే కేవలం అందంగా రాయడం మాత్రమే కాదు. దీని వల్ల ఏకాగ్రత, మనసుకు ప్రశాంతత, జ్ఞాపకశక్తి, మెదడు చురుకుదనం, సృజనశీలత, క్రమశిక్షణ పెరగడం జరుగుతుంది. అందమైన లిపి చదివితే తేలికగా అర్థం అవుతుంది. కుదురుగా రాయడం వల్ల మనకు మంచి గుర్తింపు వస్తుంది. చేతిరాతను బట్టి మన వ్యక్తిత్వాన్ని సహితం అంచనా వేస్తారు. అందమైన చేతిరాతతో పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందవచ్చు. మనం సరైన సమాధానం రాసినప్పటికీ చేడు చేతిరాత వల్ల రావలసినన్ని మార్కులు రాకపోవచ్చు. మన చేతిరాత కూడా మన విద్యాభ్యాసంలో కీలక పాత్రను పోషిస్తున్నది. మంచి చేతిరాత ఉన్న విద్యార్థుల పేపర్లను ఉపాధ్యాయుడు ఆసక్తిగా చదివి మంచి మార్కులు లేదా గ్రేడ్స్ వేస్తారు. చేతిరాతను మెరుగుపరచడానికి చిన్నతనంలోనే ప్రత్యేక శిక్షణను ఇప్పించాలి. అక్షరాలు సరైన పరిమాణంలో అందంగా రాయడం, పదానికి పదానికి మధ్య గ్యాప్ వదలడం, మార్జిన్ ఇవ్వడం, ఒకే లైన్‌లో రాయడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

### చేతిరాతను మెరుగుపరుచుకునే చిట్కాలు:

అందంగా చేతిరాత రాయడంలో మనం కూర్చునే విధానం కూడా ప్రభావితం చేస్తుంది. వెన్నెముక నిటారుగా ఉండేలా కూర్చొని, కాళ్లు నేలకు ఆనించి రాయడం వల్ల చేతిపై ఒత్తిడి తగ్గి అక్షరాలు కుదురుగా రాయడానికి ఉపకరిస్తుంది. తప్పుగా కూర్చుంటే చేతి నొప్పి కలిగి రాతపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెన్‌ను పట్టుకునే విధానం కూడా కాలిగ్రఫీలో ముఖ్యం అని గమనించాలి. చూపుడు వేలు, బొటన వేలు మధ్య పెన్నును పట్టుకోవాలి. పెన్నులను గట్టిగా పట్టుకోవద్దు. మనం రాసే అక్షరాల సైజ కూడా చేతిరాతను నిర్ణయిస్తుంది. పేజీకి నాలుగు వైపులా మార్జిన్ తీసుకోవడం, మరో చిన్నగా లేదా మరో పెద్దగా అక్షరాలు రాయవద్దు. ప్రతి పేజీలో 15 వరుసలు మాత్రమే రాయడం ఉత్తమ మార్గం. అభ్యాసం వల్ల చేతిరాత సులభంగా మెరుగుపడుతుంది. చేతి గీతాలు బాగుంటే మన భవిష్యత్తు బాగున్నట్లే, చేతిరాత బాగుంటే ఊహించిన దాని కన్న అధిక మార్కులు వస్తాయి. చేతిరాత బాగా రాసేవారి ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. రాత బాగుంటే చదువుపై ఆసక్తి పెరుగుతుంది. వేగంగా రాయడం వల్ల స్పష్టత కొరవడే ప్రమాదం ఉన్నది. విద్యార్థులు, యువత ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తే చేతిరాత సులభంగా మెరుగుపడుతుంది. చదువుతో పాటు చేతిరాతతో కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. చదివి పరీక్షలు రాస్తేనే మంచి మార్కులు రావు. మంచి మార్కులు పొందడానికి సమాధానాలను స్పష్టంగా, అందంగా, కుదురుగా రాయడం చాలా ముఖ్యం. చేతిరాత స్పష్టత కోల్పోతే సరైన సమాధానమే అయినప్పటికీ మంచి మార్కులు రావని తెలుసుకోవాలి. అందమైన చేతిరాత ఉంటే కెరీర్ కూడా బాగుంటుంది. హాండ్ రైటింగ్ బాగుంటే మెమోలో మార్కులు పుష్కలంగా కనిపిస్తాయి.

వేసవి సెలవుల్లో చేతిరాత మెరుగుపరుచుకోవడానికి అధిక సమయం కేటాయించి ప్రత్యేక శిక్షణ, అభ్యాసం పొందాలి. (చేతి)రాత, కూతను (మాట తీరు) బట్టే మన ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలుసుకుందాం. చేతిరాత మన జీవితాన్ని మార్చి వేస్తుంది.



-మధుపాళీ
9949700037

# దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన అథ్లెట్లను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేసిన పీఎం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 11:కామన్వెల్త్ గేమ్స్ విజేతలతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముచ్చటించారు. గత దశాబ్ద కాలంగా భారత క్రీడా రంగం మారుతున్న తీరును ప్రస్తావిస్తూ గత 12-13 ఏళ్ల పదవీ కాలంలో జాతీయ క్రీడాకారులను తన నివాసానికి ఆహ్వానించి, సత్కరించటం సాధారణ, అపూర్వమైన సంప్రదాయంగా మారిందని ప్రధాన మంత్రి అన్నారు. సాధారణ ప్రచారాల కన్నా అంకితభావం, నిరంతర కృషితో భారత అథ్లెట్లు సాధించిన విజయాలు... పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. "పాఠశాలలకు వెళ్లి మనం చెప్పిన మాటల కన్నా, మీ పతకాలు వారికి ఎక్కువ స్ఫూర్తిని కలిగిస్తాయి" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

తన కుమార్తెలను క్రీడా రంగంలోకి తీసుకువస్తానని గతంలో ఇచ్చిన మాటను గుర్తుచేసుకుంటూ ఒక క్రీడాకారిణిని ప్రధానమంత్రి కలిశారు. ఆమె పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే కామన్వెల్త్ గేమ్స్ లో ఆమె కుమార్తెలు మూడు పతకాలు సాధిస్తారని ప్రధానమంత్రికి చెప్పారు. ఆమె ఆత్మవిశ్వాసాన్ని అభినందించటమే కాక, అత్యుత్తమ ప్రతిభను కనబరచాలనే సంకల్పాన్ని ప్రోత్సహించారు.

క్రీడాకారుల భావోద్వేగ ప్రయాణాన్ని ప్రధానమంత్రి కొనియాడారు. గురుపూర్ణిమ రోజున సాధించిన విజయాన్ని గురువుకు అంకితం చేసిన క్రీడాకారుడి పట్టుదలను? నాలుగేళ్ల పాటు నిరంతరం గాయాలు, వ్యక్తిగత ఇబ్బందులు ఎదుర్కొని పోడియంపై జాతీయ జెండా ఎగురుతుండగా కన్నీరు పెట్టుకున్న మరో అథ్లెట్ గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. దేశ విజయాలు కేవలం వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా భావితరాలకు ఎప్పటికీ నిలిచిపోయే స్ఫూర్తినిస్తాయని అన్నారు. "మీ విజయాలు రాబోయే తరాలకు ఎంతో స్ఫూర్తి" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాల పట్ల పెరుగుతున్న గౌరవం, ప్రత్యర్థుల్లో కలుగుతున్న భయం గురించి ప్రధానమంత్రి మాట్లాడారు. ఇప్పుడు ప్రపంచ స్థాయి క్రీడాకారులు భారతీయ ప్రత్యర్థులతో పోటీ పడాల్సి వస్తే ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పెరుగుతున్న భారత బాక్సర్ల ప్రాముఖ్యతను కొనియాడారు. ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న నిరంతర మద్దతు... పోటీని ఎంతగానో మార్చేశాయని అథ్లెట్లు చెబుతున్న అభిప్రాయాలను ఆయన గుర్తుచేసుకున్నారు. "ప్రపంచ స్థాయి క్రీడాకారులు ఇప్పుడు ఈ బాక్సర్లను చూసి భయపడుతున్నారు" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

క్రీడలను ప్రోత్సహించటం వెనకున్న ఉద్దేశాన్ని స్పష్టం చేస్తూ.. ఖేలో ఇండియా కార్యక్రమం ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తూనే, క్రీడాకారులు ఎల్లప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలని ప్రధానమంత్రి చెప్పారు. కేవలం క్రీడా సదుపాయాల కల్పనతోనే కాక, సమగ్ర క్రీడా సంస్కృతిని నిర్మించటంపై దేశ క్రీడా విజయాలు ఆధారపడి ఉంటాయన్నారు. "ఒకవైపు క్రీడా వసతులు, మరోవైపు క్రీడా సంస్కృతి ఏర్పడినప్పుడే దేశం పతకాలను సాధిస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

కార్గిల్ విజయ్ దివాస్ రోజున పాకిస్తాన్ అథ్లెట్‌ను 5-0 తేడాతో ఓడించి, ఆ విజయాన్ని భారత సైనిక వీరులకు అంకితం చేసిన ఇండియన్ ఆర్మీ అథ్లెట్ దేశభక్తిని కొనియాడారు. ఇలాంటి దేశభక్తి క్రీడా విజయాలకు అసాధారణమైన కీర్తిని తెస్తుందని అన్నారు. ఆర్మీ కోచ్ నరేంద్ర రాణా గురించి ప్రస్తావిస్తూ "నరేంద్ర" అన్న పేరులోని విశేషం గురించి నవ్వుతెప్పించే సంఘటనను వివరిస్తూ అథ్లెట్‌తో సరదాగా మాట్లాడారు. "మీరు పతకాల సంఖ్యను పెంచటమే కాదు ఒక తరాన్ని తయారు చేశారు" అని శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

స్థానిక క్రీడా కేంద్రాల నుంచి అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించే స్థాయికి ఎదిగేందుకు కీలకమైన శిక్షణా వసతులను కల్పించినందుకుగాను భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ)కి కృతజ్ఞతలు తెలిపిన ఓ క్రీడాకారుడిని ప్రధానమంత్రి ప్రశంసించారు. "ఇది నాకు ఎంతో గర్వకారణం. మీరు కష్టపడి పనిచేసి, నన్ను గుర్తుంచుకున్నారు. నేను మీకు కృతజ్ఞుడను" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

వారణాసి, భోపాల్ వంటి వివిధ ప్రాంతీయ కేంద్రాల్లో మెరుగుపరచిన క్రీడా మౌలిక సదుపాయాల గురించి ప్రధాన మంత్రి అడిగి తెలుసు కున్నారు. అక్కడ క్రీడాకారులు శిక్షణ పొందటంతో పాటు వారణాసిలోని కాశీ విశ్వనాథుడు, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను కూడా సందర్శించారు. 2018లో ప్రారంభమైనప్పటి నుంచి ఖేలో ఇండియా విధానం, ఎస్ఏఐ అందిస్తున్న నిరంతర మద్దతును అభినందించారు. యువ ప్రతిభావంతులు ఉన్నత స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఇవి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. "భవిష్యత్తులోనూ మీరు మరిన్ని విజయాలు సాధిస్తారనే విశ్వాసం నాకుంది. మనం మళ్లీ ఇక్కడే కలుద్దాం" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

పలుమార్లు పతకం సాధించిన విజేత పుట్టినరోజు సందర్భంగా ఆమెకు ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు మిఠాయిలు తినిపించి వేడుకను నిర్వహించారు. సానుకూల దృక్పథంతో క్రీడాకారులు విజయాల పరంపరను కొనసాగించాలని ప్రోత్సహించారు. వరుసగా మూడోసారి పతకాలు గెలిచిన క్రీడాకారుల బృందాన్ని చిరునవ్వుతో ఆశీర్వదించారు. "ఆడేవాళ్లే గెలుస్తారు" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

## వైభవంగా శ్రీ చిన్నజీయర్ స్వామి 70వ తిరునక్షత్ర మహోత్సవాలు

ఆదిలాబాద్, ఆగష్టు 11: శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి 70వ తిరునక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని దస్తూరాబాద్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

ఈ ఉత్సవాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాలకు పంపిన వెయ్యి పవిత్ర కలశాల్లో ఒకటి దస్తూరాబాద్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుంది. పవిత్ర కలశానికి స్వాగతం పలికేందుకు భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## బాసర సరస్వతి అమ్మవారి సేవలో దర్శకుడు హరీష్ శంకర్




ఆదిలాబాద్, ఆగష్టు 11:బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలోని బాలాలయంలో సినీ దర్శకుడు హరీష్ శంకర్ మంగళవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు.

అమ్మవారి బాలాలయంలో ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో హరీష్ శంకర్‌కు ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అచ్యుత్ కుమార్, హరీష్, కళాదర్ శర్మ, వేద పండితులు నవీన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సంచార ఆహార పరీక్ష ప్రయోగశాలల కోసం దేశంలో తొలి గుర్తింపు పథకాన్ని ప్రారంభించిన ఎన్ఏబీఎల్

న్యూఢిల్లీ, ఆగష్టు 11: భారత నాణ్యత మండలి (క్యూసీఐ) ఆధ్వర్యంలోని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) సమగ్ర ముల్యాంకన కార్యక్రమం కింద దేశంలోనే తొలిసారిగా సంచార ఆహార పరీక్ష ప్రయోగశాలల కోసం గుర్తింపు విధానాన్ని ప్రారంభించింది. న్యూఢిల్లీలోని హోటల్ అశోకాలో నిర్వహించిన 'గుణవత్త సమన్వయం- బహు పాక్షిక అవగాహన ఒప్పందాల మార్పిడి కార్యక్రమం' వేదికగా ఈ నూతన విధానాన్ని అధికారికంగా ఆవిష్కరించారు.

సమాజంలో ప్రతి ఒక్కరికీ నమ్మకమైన, నాణ్యమైన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆహార పరీక్షా సేవలను నేరుగా ప్రజల వద్దకే విస్తరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలో పాల్గొన్న వివిధ భాగస్వామ్య సంస్థల మధ్య బహుళపక్ష అవగాహన ఒప్పందాల మార్పిడి జరిగింది. ఇది నియంత్రణ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడానికి, ఏకీకృత తనిఖీలకు, మరింత సమర్థవంతమైన నాణ్యతా మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తోడ్పడుతుందని ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహకం, అంతర్గత వ్యాపార శాఖ (డీపీఐఐటీ) కార్యదర్శి శ్రీ అమర్‌దీప్ సింగ్ భాటియాతో పాటు క్యూసీఐ, ఎన్ఏబీఎల్ ఉన్నతాధికారులు, వివిధ నియంత్రణ అధికార సంస్థలు, సమగ్ర ముల్యాంకన విధానాలతో అనుసంధానమైన కమోడిటీ బోర్డుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఏబీఎల్ రూపొందించిన ఈ ప్రత్యేక గుర్తింపు పథకం ద్వారా సంచార ఆహార పరీక్ష ల్యాబ్‌లకుఅధికారిక గుర్తింపు లభిస్తుంది. దీనివల్ల కేవలం స్థిరమైన ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, మొబైల్ వాహనాల ద్వారా సమాజంలో ప్రతి ప్రాంతంలోనూ అంతర్జాతీయ స్థాయి ఆహార తనిఖీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ కార్యక్రమం వల్ల దేశంలో ఆహార భద్రతా పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలపడటమే కాకుండా, కలుషిత లేదా నాణ్యత లేని ఆహారంపై ప్రభుత్వ నియంత్రణ సంస్థలు వేగంగా చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. అంతిమంగా వినియోగదారుల్లో ఆహార నాణ్యత, భద్రతపై నమ్మకం గణనీయంగా పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

బహుపాక్షిక అవగాహన ఒప్పందాల మార్పిడి కార్యక్రమంలో పాల్గొన్న సంస్థలు సమన్వయంతో కూడిన మూల్యాంకనాలు, నియంత్రణ వ్యవస్థల సమన్వయం, సమగ్ర మూల్యాంకన వ్యవస్థను బలోపేతం చేయడంపై తమ నిబద్ధతను చాటాయి. ఈ కార్యక్రమం ద్వారా మూల్యాంకన ప్రక్రియల్లో పునరావృతిని తగ్గించడం, పరస్పర గుర్తింపును ప్రోత్సహించడం, నియంత్రణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వ్యాపారం సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే సమయంలో నాణ్యత, నిబంధనల అమలులో ఉన్నత ప్రమాణాలను కొనసాగించనున్నారు.

కార్యక్రమంలో డీపీఐఐటీ కార్యదర్శి శ్రీ అమర్‌దీప్ సింగ్ భాటియా మాట్లాడుతూ.. మొత్తం విలువ వ్యవస్థలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. 'గుణవత్తా సమన్వయ' వంటి కార్యక్రమాలు నాణ్యత ఆధారిత విధానాలను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి భారత్ అభివృద్ధి ప్రస్థానానికి దోహదపడతాయని ఆయన అన్నారు.

అక్రిడిటేషన్ పథకం, సమగ్ర మూల్యాంకన వ్యవస్థ ప్రాధాన్యతను ఎన్ఏబీఎల్ చైర్‌పర్సన్ డాక్టర్ సందీప్ షా వివరించారు. దేశ అభివృద్ధికి సహకారంతో కూడిన మూల్యాంకన ప్రక్రియలు, విశ్వసనీయ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

బలమైన నాణ్యత వ్యవస్థను నిర్మించడంలో సహకారం, సమన్వయం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సెక్రటరీ జనరల్ శ్రీ చక్రవర్తి టీ కన్నన్ అన్నారు. 'గుణవత్తా సమన్వయ' కార్యక్రమంతో పాటు మొబైల్ ఆహార పరీక్షా ప్రయోగశాలల కోసం ప్రారంభించిన అక్రిడిటేషన్ పథకం దేశ నాణ్యత మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పరీక్షా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో దోహదపడుతుందని తెలిపారు. 'గుణవత్తా సమన్వయ' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం ద్వారా, సహకారంతో కూడిన నాణ్యత కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, నియంత్రణ ప్రమాణాలను మెరుగుపరచడం, భాగస్వాముల విశ్వాసాన్ని పెంపొందించడం, దేశ నాణ్యత మౌలిక వసతులను బలోపేతం చేయడంలో క్యూసీఐ, ఎన్ఏబీఎల్ సంస్థల నిబద్ధత మరింత స్పష్టమైంది.

## ఆలయం వద్ద పుష్కర ఘాట్ నిర్మించాలని వినతి



ఆదిలాబాద్, ఆగష్టు 11:కడెం మండలం లింగాపూర్ గ్రామంలోని గోదావరి తీరాన ఉన్న గుండు వీర హనుమాన్ ఆలయం వద్ద మినీ పుష్కర ఘాట్ నిర్మించాలని గ్రామస్తులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జును కోరారు. ఈ మేరకు లింగాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్‌కుమార్, ఉప సర్పంచ్ కమ్ముల లక్ష్మీస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ పి.రాజేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బెల్లాల రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ మాదాసు నగేష్ తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

వినతిపై స్పందించిన ఎమ్మెల్యే వెడమ బొజ్జు.. పుష్కర ఘాట్ నిర్మాణానికి సంబంధించి అధికారులతో మాట్లాడి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవిందుల మధుసూదన్, పాత్రికేయులు మాదాసు రాజేందర్, సుతారి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన బ్లూ కోర్ట్ పోలీసులు

ఆదిలాబాద్, ఆగష్టు 11:కడెం మండలం మాసాయిపేట్ గ్రామం వద్ద మానవత్వం చాటుకున్నారు బ్లూ కోర్ట్ పోలీసులు. ఎలగడపకు చెందిన ఆడెపు రాములు కూరగాయల ఆటో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలోని కూరగాయలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి.

అదే సమయంలో అటుగా వెళ్తున్న బ్లూ కోర్ట్ పోలీసులు భీమ్‌రావు, గణేష్ వెంటనే స్పందించి ఆటోను పైకి లేపారు. రోడ్డుపై పడిపోయిన కూరగాయలను ఏరి తిరిగి ఆటోలోకి ఎక్కించి పంపించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సాయం చేసిన పోలీసుల తీరును స్థానికులు అభినందించారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష సాయం

ఆదిలాబాద్, ఆగష్టు 11:ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారం అందిస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గతంలో రూ.50 వేలు అందించగా, మంగళవారం మరో రూ.50 వేలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముష్కె శ్రీనివాస్ ద్వారా ఆలయ పాలకవర్గానికి అందజేశారు.

ఆలయానికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఎస్‌డీఎఫ్‌సీ నిధుల నుంచి రూ.1.35 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఎండోమెంట్ కింద ఆలయ అభివృద్ధికి మరో రూ.10 లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.


ప్రేమ సేవ

ఆహ్వానం

చిమ్మపూడి ఫౌండేషన్

హైదరాబాదు

శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం

సంయుక్త ఆధ్వర్యంలో

కథా సౌదామిని

(కథా రచయిత్రుల సమ్మేళనం)

తేది : 16-08-2026 ఆదివారం సా॥ 05-30 గం॥లకు

వేదిక : శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం, హైదరాబాదు.

ముఖ్య అతిథి & సన్మానకర్త :

డా॥ కె.వి. రమణ గారు, (ఐ.ఏ.ఎస్. రిటైర్డ్)

తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, చిమ్మపూడి ఫౌండేషన్ గౌరవ సలహాదారు

సభాధ్యక్షులు : డా॥ కొండపల్లి నీహారిణి గారు,

గౌరవ అతిథులు : శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు, శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి గారు,

సభా సమన్వయకర్త : శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి గారు, అధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్

కథా కథనంలో పాల్గొంటున్న రచయిత్రులు :

శ్రీమతి వారణాసి నాగలక్ష్మి గారు, శ్రీమతి గరిమెళ్ల సుబ్బలక్ష్మి గారు,
శ్రీమతి ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మి గారు, డా॥ దేవులపల్లి వాణీదేవి గారు,
శ్రీమతి గంటి భానుమతి గారు, శ్రీమతి యలమర్తి అనూరాధ గారు,
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, శ్రీమతి జ్వలిత గారు,
శ్రీమతి గంటి ఉషాబాల గారు, శ్రీమతి శైలజామిత్ర గారు,

వ్యాఖ్యానం : శ్రీమతి పి.వి.ఎల్. సుజాత గారు

వందన సమర్పణ : శ్రీ చిమ్మపూడి రవికుమార్ గారు, ఉపాధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్

ఉడయవర్లు, కార్యదర్శి
శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం

మీ ఆగమనాభిలాషులు
చిమ్మపూడి ఫౌండేషన్ కార్యవర్గం

# పరీక్షలు, ప్రవేశాలు, చెల్లింపులు అన్నీ సకాలంలో జరగాలి - సమర్థవంతమైన వ్యవస్థకు అదే అసలైన పరీక్ష : శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 11:కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు పూసాలోని ఐసీఏఆర్–ఐఏఆర్ఐలో జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దేశ వ్యాప్తంగా వ్యవసాయ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్ నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమం కింద 6,000 మందికి పైగా విద్యార్థులకు మొత్తం రూ.21.35 కోట్లను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) విధానం ద్వారా నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు.

విద్యార్థులకు సకాలంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్థిక సహాయం అందేలా కొత్త కార్యక్రమం ద్వారా వ్యవసాయ విద్యార్థులకు ఇకపై ప్రతి నెలా స్కాలర్‌షిప్ మొత్తాన్ని డీబీటీ విధానం ద్వారా నేరుగా అందించనున్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, స్కాలర్‌షిప్‌లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వ్యవసాయ విద్యను బలోపేతం చేయడంతో పాటు దానిని ఆచరణాత్మక శిక్షణ, మరిన్ని అవకాశాలతో అనుసంధానించేందుకు అవి కీలక సాధనాలని అన్నారు. డీబీటీ విధానం ద్వారా విద్యార్థులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుందని, సంప్రదాయ విధానాల్లో ఉండే జాప్యాలను తొలగించేందుకు ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, వ్యవసాయ విద్యలో ఆచరణాత్మక శిక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కేవలం తరగతి గదుల్లో బోధించే విద్యతోనే మంచి రైతులు, శాస్త్రవేత్తలు లేదా వ్యవసాయ పారిశ్రామికవేత్తలను తయారు చేయలేమని, వ్యవసాయ రంగంలో అసలైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్షేత్రస్థాయి శిక్షణ ఎంతో అవసరమని అన్నారు. వ్యవస్థలో మరింత మెరుగుదలకు సూచనలు, ఆలోచనలను పంచుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో వ్యవసాయ రంగంలో ఆహార భద్రత, పోషకాహారం, రైతుల ఆదాయ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని శ్రీ చౌహాన్ అన్నారు. ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సేవలను ప్రశంసిస్తూ, వారి పరిశోధనలతో పాటు రైతుల కృషి కూడా దేశ ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు.

యువత తమ కెరీర్‌కే పరిమితం కాకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దేశానికి అర్థవంతమైన సేవ చేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. వ్యవసాయ విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ప్రయత్నించకుండా వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు నాయకత్వం వహించాలని ఆయన సూచించారు.

ఎన్ఎస్‌పీ – డీబీటీ విధానం ద్వారా స్కాలర్‌షిప్‌ల పంపిణీ మరింత పారదర్శకంగా, వేగంగా, సులభంగా జరుగుతుందని శ్రీ చౌహాన్ అన్నారు. సకాలంలో ఆర్థిక సహాయం అందడం వల్ల విద్యార్థులు తమ విద్యపై మరింత సమర్థవంతంగా దృష్టి కేంద్రీకరించగలరని పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయ విద్యను సాంకేతికత, శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

హరియాలి అమావాస్య సందర్భంగా దేశవ్యాప్తంగా ఐసీఏఆర్ సంస్థల్లో మొక్కల నాటే కార్యక్రమాల్లో పాల్గొనాలని వ్యవసాయ విద్యార్థులకు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ రెండింటి పట్ల సమష్టి బాధ్యతలో భాగంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలని ఆయన అన్నారు.

కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్, ఐసీఏఆర్ కార్యదర్శి శ్రీ జ్ఞానేంద్ర త్రిపాఠి, డీడీజీ డాక్టర్ యశ్‌పాల్ సింగ్ మాలిక్, ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ సి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐసీఏఆర్, ఐఏఆర్ఐకు చెందిన ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. వేలాది మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దేవాదుల నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

నల్గొండ, ఆగష్టు 11: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేవాదుల ప్రాజెక్టు నీటి నిర్వహణ, నీటి లభ్యత, పంపుహౌస్‌ల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను కోరారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హన్మకొండ జిల్లా చింతగట్టులోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు.

ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. భీమ్‌ఘనపూర్ చెరువు నుంచి రామప్ప చెరువుకు, అక్కడి నుంచి వంగపెల్లి వాగు ద్వారా గణపురం చెరువులోకి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గణపురం చెరువులో నీటి నిల్వ పెంచితే భూపాలపల్లి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని చెప్పారు.

## పశువైద్య సేవలు మెరుగుపరచాలి

### -సకాలంలో వైద్యం అందేలా చర్యలు..
### -తిమ్మాజీపేట వెటర్నరీ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



మహబూబ్‌నగర్, ఆగష్టు 11:పశుసంపద పరిరక్షణతో పాటు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మరికల్ గ్రామంలో రైతులను కలిసి పశుపోషణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పశువులకు నిర్వహిస్తున్న చికిత్సలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు పశువులకు వైద్యం కోసం వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే సేవలు అందించాలని సూచించారు. తిమ్మాజీపేట మండలంలో ఉన్న పశువుల సంఖ్య, వాటి ఆరోగ్య పరిస్థితి, పశువుల యజమానుల వివరాల నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. పశువులు, రైతుల ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేందుకు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పశువులకు టీకాలు, వైద్య పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందుతున్నాయా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పాండు, తిమ్మాజీపేట సర్పంచ్ కవిత, మండల అధికారులు, పశు వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విఠల నామస్మరణతో బైరాపూర్‌కు పాదయాత్ర



కామారెడ్డి, ఆగష్టు 11:(నేటినిజం ప్రతినిధి)జుక్కల్ మండలం లొంగన్ గ్రామం భక్తి కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఆషాఢమాసం ముగింపు సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈసారి కూడా గ్రామానికి చెందిన భక్తులు బైరాపూర్‌లోని ప్రసిద్ధ విఠలేశ్వర ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. మంగళవారం శంకర్ మహరాజ్, బాలాజీ మహరాజ్, హన్మంత్ మహరాజ్, బల్‌రాం మహరాజ్‌ల ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులు పాదయాత్ర ప్రారంభించారు.

భాజా భజంత్రీలు, భజన కీర్తనలతో ప్రారంభమైన పాదయాత్రలో విఠల.. విఠల నామస్మరణలతో లొంగన్ గ్రామం మారుమోగింది. సుమారు 55 కిలోమీటర్ల మేర రెండు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. గ్రామ సర్పంచ్ భర్త సదాశివ్ పటేల్, గ్రామ పెద్దలు గ్రామ పొలిమేరల వరకు వచ్చి భక్తులకు వీడ్కోలు పలికారు. చిన్న ఎడ్గి, లాడేగాం, ఫత్లాపూర్, బిచ్కుంద, హజ్గుల్ గ్రామాల మీదుగా యాత్ర సాగనుంది. హజ్గుల్ గ్రామంలో భక్తులు రాత్రి బస చేయనున్నారు. బుధవారం బైరాపూర్ చేరుకుని విఠలేశ్వరుడికి జలాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పాదయాత్రలో నామ్‌దేవ్, శంకర్‌గౌండ, నగల్‌గిద్దె రామ్‌నాథ్, రాజు, కౌరే శంకర్, వడ్ల మారుతి, మాజీ ఎంపీటీసీ విఠల్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## 150 ఏళ్ల వందేమాతరం, వికసిత భారత్ 2047 కోసం యువశక్తికి అంకితమిస్తూ 2026 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

న్యూఢిల్లీ, ఆగష్టు 11:భారతావని ఆగస్టు 15, 2026న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకునేందుకు సన్నద్ధమవుతోంది. ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ వేడుకలకు నాయకత్వం వహిస్తారు. రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 2026తో 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, స్వాతంత్ర్య పోరాటంలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చిన ఈ జాతీయ గేయాన్ని, దాని చిరస్మరణీయ వారసత్వానికి నివాళిగా మొదటి సారిగా ఎర్రకోట బురుజుల నుంచి ఆలపించనున్నట్లు తెలిపారు.

ప్రధానమంత్రి ఎర్రకోటకు చేరుకోగానే 'వందేమాతరం' ఆలపిస్తారు.

అనంతరం, ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సాంప్రదాయబద్ధంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణంలో యువ భాగస్వామ్యాన్ని గుర్తిస్తూ, ఈ ఏడాది వేడుకలను 'యువశక్తి' కోసం కూడా ప్రత్యేకించినట్టు రక్షణ శాఖ కార్యదర్శి తెలిపారు.

ఎర్రకోటకు ఎదురుగా ఉన్న జ్ఞాన్‌పథ్‌లో 'వందే మాతరం' ఇతివృత్తాన్ని ప్రతిబింబించేలా పుష్పాలంకరణతో ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లకు చెందిన మొత్తం 2,500 మంది బాలబాలికలతో కూడిన క్యాడెట్లు పాల్గొంటారు.

భారత వాయుసేనకు చెందిన ఎంఐ -17 హెలికాప్టర్ 'వందేమాతరం' 150 ఏళ్ల బ్యానర్‌ను ప్రదర్శిస్తూ, ఎర్రకోట వద్ద ఉన్న ప్రజలపై పూలవాన కురిపిస్తుంది.

## ఎన్‌సీఈఆర్‌టీకి డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదా మంజూరు

న్యూఢిల్లీ, ఆగష్టు 11:డీమ్డ్ టు బి యూనివర్సిటీ హోదాను మంజూరు చేయాలని కోరుతూ న్యూఢిల్లీలోని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సమర్పించిన దరఖాస్తును యూజీసీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ సంస్థలు) నియంత్రణలు–2023లోని నిబంధనల ప్రకారం నిపుణుల కమిటీ ద్వారా యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పరిశీలించింది. సమగ్ర అంచనా అనంతరం న్యూఢిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీకి డీమ్డ్ టు బి యూనివర్సిటీ హోదాను మంజూరు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. యూజీసీ సలహాను పరిగణనలోకి తీసుకొని యూజీసీ చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం 30.03.2026న జారీచేసిన నోటిఫికేషన్ ద్వారా న్యూఢిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీని డీమ్డ్ టు బి యూనివర్సిటీగా విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పరిశోధనా కార్యక్రమాలతో పాటు డాక్టోరల్, వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనే షరతుకు ఈ ప్రకటన లోబడి ఉంటుంది.

విద్యా పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలోనూ, జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సహకారాన్ని పెంపొందించుకోవడంలోనూ ఎన్‌సీఈఆర్‌టీ సామర్థ్యాన్ని డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయ హోదా బలోపేతం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక సాయం అందించే థింక్ ట్యాంకుగా, జాతీయ వనరుల సంస్థగా ఎన్‌సీఈఆర్‌టీ పోషిస్తున్న పాత్రను పటిష్టం చేస్తుంది.

ఈ రోజు లోక్‌సభలో లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఈ సమాచారాన్ని వెల్లడించారు.

## జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ చట్రం(ఎన్ఐఆర్ఎఫ్)లో ఉన్నత విద్యాసంస్థల (హెచ్ఈఐ) ప్రగతి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:ఉన్నత విద్యాసంస్థల (హెచ్ఈఐ)లో విద్యా రంగంలో నాణ్యత మెరుగుదలను జాతీయ విద్యా విధానం–2020(ఎన్ఈపీ) స్పష్టం చేసింది. బహుళ కోర్సుల అభ్యాసానికి ప్రాధాన్యం, విమర్శనాత్మక దృక్పథం, విశ్లేషణాత్మక సామర్థ్య వికాసం, పరిశోధన- ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల నాణ్యత పెంపు, సమర్థ–నాణ్యమైన ఉపాధ్యాయ శిక్షణ తదితరాలు ఇందులో భాగంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో దేశంలోని ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల మధ్య ఆరోగ్యకర పోటీ ద్వారా వార్షిక ర్యాంకింగ్‌తో (ఇండియా ర్యాంకింగ్స్) గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2015లో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ చట్రం (ఎన్ఐఆర్ఎఫ్) రూపొందించింది. దీనికింద "బోధన–అభ్యసనం–వనరులు, పరిశోధన–వృత్తిగత విధానాలు, స్నాతకోత్సవ ఫలితాలు, విస్తరణ–సార్వజనీనత, సహ సంస్థల దృక్పథం" పేరిట ఐదు విస్తృత అంశాల ప్రాతిపదికన ర్యాంకులు ఇస్తుంది. ఈ గుర్తింపు నిమిత్తం 2021లో 6,272 దరఖాస్తులు రాగా, 2025 నాటికి వాటి సంఖ్య 14,163కు పెరగడం గమనార్హం. అలాగే, 'ఎన్ఐఆర్ఎఫ్' కింద పోటీపడే ప్రత్యేక సంస్థల సంఖ్య కూడా 2021-2025 మధ్యకాలంలో 4,030 నుంచి 7,692కు చేరడం విశేషం.

ఎన్ఐఆర్ఎఫ్'ను ప్రారంభించిన తర్వాతి నుంచి 'క్వాక్వారెల్లి సైమండ్స్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ (క్యూఎస్ డబ్ల్యూయూఆర్) జాబితాలోకెక్కే భారత ఉన్నత విద్యాసంస్థల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ మేరకు 'క్యూఎస్ డబ్ల్యూయూఆర్–2015'లో 11 'హెచ్ఈఐ'లకు అందులో చోటు లభించగా 2027 ర్యాంకింగ్స్ జాబితాలో వాటి సంఖ్య 52కు చేరింది.

## ఏపీఈడీఏ సహకారంతో త్రిపురలోని దెర్గాంగ్ ఎఫ్‌పీఓ ద్వారా తొలిసారిగా దుబాయ్‌కు ఆవ తేనె ఎగుమతి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:భారత ప్రభుత్వ వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార పదార్థాల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) ఆధ్వర్యంలో త్రిపురకు చెందిన దెర్గాంగ్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ద్వారా సేకరించిన 1 మెట్రిక్ టన్ను నాణ్యమైన ఆవ తేనెను దుబాయ్‌కి విజయవంతంగా ఎగుమతి చేశారు. త్రిపుర ప్రాంతం నుంచి ఆవ తేనె విదేశాలకు ఎగుమతి కావడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంతో స్థానిక తేనెటీగల పెంపకందారులకు, రైతులకు అంతర్జాతీయ మార్కెట్లలోకి అడుగుపెట్టే గొప్ప అవకాశం లభించింది. ఈ ఎగుమతి ఆ రైతు ఉత్పత్తిదారుల సంస్థకే కాకుండా, ఆ ప్రాంతానికి కూడా ఒక సరికొత్త మైలురాయిగా నిలిచింది.

ఈ ప్రాంతం నుంచి ఆవ తేనె విదేశాలకు ఎగుమతి కావడం ఇదే మొదటిసారి. ఇది త్రిపుర తేనె వ్యాపార రంగాన్ని మరింత విస్తరించడానికి కొత్త మార్గాలను తెరిచింది. ఈ ప్రయత్నం వల్ల స్థానిక రైతులు, రైతు సంఘాలు రాబోయే రోజుల్లో ఎగుమతి అవకాశాలపై దృష్టి పెట్టడమే కాకుండా, అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్లలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రోత్సాహం లభిస్తుంది.

ఈ ఎగుమతి ద్వారా దెర్గాంగ్ ఎఫ్‌పీఓ అనుబంధ రైతులకు స్థానిక మార్కెట్‌తో పోలిస్తే తమ ఉత్పత్తులకు మరింత మెరుగైన, లాభదాయకమైన ధర లభిస్తుందని భావిస్తున్నారు. ఇలా అంతర్జాతీయ మార్కెట్ అందుబాటులోకి రావడం వల్ల తేనెటీగల పెంపకందారులకు అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా, నాణ్యతతో కూడిన ఎగుమతి ఆధారిత తేనె ఉత్పత్తి పద్ధతులను అవలంబించేందుకు వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుంది.

ఈ కార్యక్రమానికి సాల్ట్ రేంజ్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ పూర్తి మద్దతునందించి, చేయూతనిచ్చింది. ఈ సంస్థ తేనె ఉత్పత్తిని పెంచడానికి, ఎగుమతికి అనువైన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి దెర్గాంగ్ ఎఫ్‌పీఓతో కలిసి పనిచేస్తోంది. ఈ ఉమ్మడి భాగస్వామ్యం వల్ల సదరు ఎఫ్‌పీఓ అంతర్జాతీయ మార్కెట్ వైపు తన తొలి అడుగు వేయగలిగింది. అలాగే స్థానిక రైతులు కూడా ఎగుమతి వ్యాపారంలో క్రమబద్ధమైన పద్ధతిలో భాగస్వాములు కావడానికి ఒక మంచి అవకాశం లభించింది.

త్రిపుర రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ ఎగుమతుల వ్యవస్థకు, ముఖ్యంగా తేనె, తేనెటీగల పెంపక రంగానికి ఈ ఎగుమతి కీలకంగా నిలిచింది. వైవిధ్యభరితమైన వ్యవసాయ వనరులు ఉన్న త్రిపురలో.. సంఘటిత రైతు సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన తేనె, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను మరింత విస్తరించడానికి భారీ అవకాశాలు ఏర్పడ్డాయి.

ఈ ఆవ తేనె ఎగుమతి విజయం ఎఫ్‌పీఓలు, ప్రైవేటు పరిశ్రమలు కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక రైతులను అంతర్జాతీయ మార్కెట్లతో ఎలా అనుసంధానించవచ్చో నిరూపించింది. ఈ కార్యక్రమం త్రిపురతో పాటు, ఈశాన్య భారత్‌లోని ఇతర ఎఫ్‌పీఓలను, రైతులను కూడా తమ ఉత్పత్తులకు విలువ జోడించడం, నాణ్యతను పెంచడం, విదేశీ ఎగుమతి అవకాశాలను అన్వేషించేలా ఎంతగానో ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

ఈ అద్భుతమైన విజయంపై త్రిపుర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ రతన్ లాల్ నాథ్ హర్షం వ్యక్తం చేస్తూ.. "దెర్గాంగ్ ఎఫ్‌పీఓ సాధించిన ఈ తొలి ఆవ తేనె ఎగుమతి త్రిపుర తేనెటీగల పెంపకందారులకు, రైతులకు ఒక గొప్ప విజయం. మన స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునే సత్తా ఉందని, తద్వారా రైతు కుటుంబాల ఆదాయాన్ని మెరుగుపరచవచ్చని ఇది నిరూపించింది. రాష్ట్రంలో తేనెటీగల పెంపకాన్ని, సేంద్రీయ వ్యవసాయాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, పెద్ద మార్కెట్లను చేరుకునేలా సహాయం చేయడానికి త్రిపుర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రైతులు, ఎఫ్‌పీఓలు, ఎగుమతిదారులు, ఏపీఈడీఏ వంటి ప్రభుత్వ సంస్థల ఉమ్మడి కృషితో.. నాణ్యమైన వ్యవసాయ, ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రపంచ మార్కెట్లో త్రిపుర తన ఉనికిని మరింత బలంగా చాటుకోగలదు" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ తేనె ఎగుమతి సరుకును త్రిపుర రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ రతన్ లాల్ నాథ్ అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో త్రిపుర ప్రభుత్వ వ్యవసాయ, ఉద్యానవన శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ రాయ్ ఐఏఎస్, ఐఎఫ్ఓఎమ్ ఆర్గానిక్స్ ఆసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి జెన్నీఫర్ చాంగ్, ఏపీఈడీఏ ఉన్నతాధికారులు, ఎగుమతిదారుల ప్రతినిధులు, లాజిస్టిక్స్ భాగస్వాములు, ఆ ప్రాంతానికి చెందిన ఆదర్శ తేనెటీగల పెంపకందారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈశాన్య భారత ప్రాంతం నుంచి వ్యవసాయ ఎగుమతులను పెంపొందించడానికి ఏపీఈడీఏ నిరంతరం కృషి చేస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు సంఘాలు, ఎగుమతిదారులు, ప్రాసెసర్లు, ఇతర భాగస్వాములతో కలిసి పనిచేస్తోంది. మార్కెట్ అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి, నాణ్యత హామీ, ఎగుమతుల సౌలభ్యం ద్వారా ఎగుమతులను వేగవంతం చేస్తోంది. ఇటువంటి కార్యక్రమాలు రైతులకు నిరంతర ఆదాయం ఇచ్చే మార్కెట్ అవకాశాలను సృష్టించడమే కాకుండా, దేశంలోని విభిన్న వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయి.

## ద్వైపాక్షిక నౌకా వాణిజ్య సహకారం బలోపేతానికి మారిషస్‌లో భారతీయ నౌకాదళ ప్రధానాధికారి అధికార పర్యటన

న్యూఢిల్లీ, ఆగష్టు 11:నౌకాదళ ప్రధానాధికారి (సీఎన్ఎస్) అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నేటి నుంచి నాలుగు రోజుల పాటు.. 2026 ఆగస్టు 10 మొదలు ఆగస్టు 13 వరకు మారిషస్‌లో అధికార పర్యటన చేపడుతున్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న మారిషస్‌తో ద్వైపాక్షిక నౌకా వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, రక్షణ సంబంధాలను పటిష్ఠపరుచుకొనే దిశగా భారత్ నిరంతర ప్రయత్నాల్లో ఈ పర్యటన ఓ భాగం.

మారిషస్ ప్రభుత్వ సీనియర్ నాయకులతో సీఎన్ఎస్ సమావేశమవుతారు. నౌకావాణిజ్య భద్రత, రక్షణ సంబంధిత సహకారం, సామర్థ్యాల పెంపుతో పాటు సైన్య సహకారం వంటి ఇరు దేశాల ప్రయోజనాలూ ముడిపడి ఉన్న అంశాలపై వారితో ఆయన చర్చిస్తారు.

నౌకావాణిజ్య రంగంలో భారత్– మారిషస్ సహకారాన్ని ఇప్పటి కన్నా బలపరుచుకోవడం, యుద్ధ కార్యకలాపాల స్థాయి అనుబంధాన్ని పెంపొందించుకోవడం, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దృఢతరం చేసుకోవడం ఈ పర్యటన ధ్యేయాలు.

నౌకావాణిజ్య రంగంలో భారత్, మారిషస్‌లు చాలా కాలంగా సన్నిహిత భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. నేషనల్ కోస్ట్ గార్డ్‌తో భారతీయ నౌకాదళం క్రమం తప్పక శిక్షణను ఇచ్చి పుచ్చుకొంటూ ఉండడమే కాక, జల సంబంధ సర్వేలు, ఓడరేవుల సందర్శనలు, సంయుక్త ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజెడ్) నిఘా సహా వేర్వేరు కార్యకలాపాలలో కూడా పాలుపంచుకుంటోంది. రెండు దేశాలూ బహుళ పక్ష వేదికల్లో, సహకార పూర్వక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ కలసిమెలసి ఉంటూ, సహకరించుకుంటున్నాయి. హిందూ మహాసముద్ర నౌకాదళ సదస్సు, 'ఎంఐఎల్ఏఎన్' ("మిలన్"), ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, గోవా నౌకావాణిజ్య సదస్సు, 'ఐఓఎన్ సాగర్', 'ఎక్సర్‌సైజ్ ఏఐకేఈవైఎమ్ఈ' వంటి భారతీయ నౌకాదళ ప్రధాన కార్యక్రమాల్లో మారిషస్ పాల్గొంటోంది. 'మహాసాగర్' (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) సంబంధిత ద్వైపాక్షిక దృష్టికోణానికి కూడా ఈ భాగస్వామ్యం అద్దం పడుతోంది.

అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నౌకాదళ ప్రధానాధికారిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన తరువాత మారిషస్‌లో పర్యటించడం భారత్ మారిషస్ మైత్రికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది. పరస్పర గౌరవం, విశ్వాసం నౌకావాణిజ్యం పట్ల ఆసక్తిలతోపాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రాంతీయ సహకారం, స్థిరత్వం అంశాల పట్ల ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధత ఈ మైత్రిలో కీలక పాత్రను పోషిస్తున్నాయి.

# సిరిసిల్ల వైస్ చైర్మన్ సందీప్‌పై కుట్రలు.. నేత కార్మికుడి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి!



కరీంనగర్, ఆగష్టు 11: సిరిసిల్లలో రాజకీయ ఆరోపణల మధ్య చోటుచేసుకున్న నేత కార్మికుడి మృతి కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఓ నేత కార్మికుడి హత్యను అడ్డుపెట్టుకొని మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్‌ను ఇరికించేందుకు కుట్ర జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తాను హత్య చేస్తే ఆ నేరాన్ని వైస్ చైర్మన్‌పై నెట్టేయొచ్చన్న ఉద్దేశంతోనే వెంకటేశంను హత్య చేసినట్లు నిందితుడు కుసుమ గణేష్ వెల్లడించినట్టు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. కేసులో గణేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇక అసలు ట్విస్ట్ ఏంటంటే.. వైస్ చైర్మన్‌పై ఆరోపణలు చేసిన వ్యక్తే హత్యకు గురికావడం, అనంతరం మృతదేహంతో ఆయన ఇంటి ఎదుట ఆందోళనకు యత్నించడం, తీరా పోలీసుల దర్యాప్తులో హత్య వెనుక మరో కోణం బయటపడటం సిరిసిల్లలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఉ వ నీ ణ తీ జీ జూ ష్ట్ర తి ఇ ఖీవటవతీవనిఇవ

ఫిర్యాదు చేసిన వ్యక్తే హత్యకు గురై..

ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు అడిగారంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్‌పై నేత కార్మికుడు వెంగల వెంకటేశం ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంతలోనే ఈ నెల 8న వెంకటేశం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వెంకటేశం మృతదేహాన్ని వైస్ చైర్మన్ దార్ల సందీప్ ఇంటి ఎదుట ఉంచి ఆందోళన చేస్తామని కొందరు కాంగ్రెస్ నాయకులు హంగామా చేశారు. పోలీసులు, ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇంతలోనే వెంకటేశం హత్యకు గురయ్యాడని పోలీసుల దర్యాప్తులో తేలడం సిరిసిల్లలో సంచలనం రేపింది. వెంకటేశం పనిచేస్తున్న యజమాని కుసుమ గణేష్ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి వెల్లడించారు. వైస్ చైర్మన్ దార్ల సందీప్‌పై గతంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో.. తాను చేసిన హత్యను ఆయనపైకి మళ్లించాలనే ఉద్దేశంతోనే వెంకటేశాన్ని చంపేసినట్లు నిందితుడు చెప్పినట్లు తెలిపారు.

నిందితుడి ఉద్దేశం, హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు మరింత విచారణ చేస్తున్నారు. కాగా గణేష్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులతో ఉన్న సంబంధాలపైనా ఆరా తీస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దార్ల సందీప్‌పై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నేత గాజుల లక్ష్మణ్‌తో పాటు పోసు రమేశ్, పసునూరి సూర్యప్రకాశ్, మరో వ్యక్తితో గణేశ్‌కు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సంబంధాలపై మరింత విచారణ కొనసాగుతుందని చెప్పారు.

కాగా, సిరిసిల్లలో సందీప్‌పై కుట్రలు, హత్యా రాజకీయాలు వెలుగులోకి రావడంతో అధికార పార్టీపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# గోదావరి పుష్కరాలకు 210 కోట్ల నిధులు

అమరావతి, ఆగష్టు 11: మహా కుంభమేళా మాదిరిగానే అఖండ గోదావరి మహా పుష్కరాలను నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ. 210 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2027లో నిర్వహించే గోదావరి మహా పుష్కరాల కోసం 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే ఈ నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో 238 పాత, కొత్త పుష్కరఘాట్ల అభివృద్ధి పనులు చేపడుతన్నారు.

ఈ ఏడాది ఆరంభం జనవరి 3 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రయాగ్‌రాజ్ లో మహాకుంభమేళా జరిగింది. దీని మాదిరిగానే మహా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్'లో భాగంగా ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ప్రు ష్క ర ఘా ట్ల ను ఆధునీకరిస్తున్నారు. నదీ తీరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పుష్కరాలకు ప్రధాన వేదిక అయిన రాజమండ్రి గోదావరి తీరాలను భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గోదావరి పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్నారు.

# అయోధ్య ట్రస్టు సీఈవో.. 18 మందికి ఇంటర్వ్యూలు ప్రారంభం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 11: అయోధ్య రామాలయానికి సీఈవోను ఎంపిక చేసే ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. కొత్తగా నిర్మించిన రామాలయంలో ఇవాళ సీఈవో పోస్టుకు ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మొత్తం 18 మందిని ఇంటర్వ్యూల కోసం షార్ట్‌లిస్టు చేసిన విషయం తెలిసిందే. శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సీఈవోగా ఎవరి ఎంపిక అవుతారన్న అంశం ఇప్పు డు ఆసక్తిగా మారింది. రామాలయంలో నిధులను చోరీ చేసిన ఘటన నేపథ్యంలో పూర్తి స్థాయి సీఈవోను నియమించాలని ట్రస్టు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సుమారు 5200 దరఖాస్తులను పరిశీలించి, దాంట్లో నుంచి 18 మందిని ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూల ప్రక్రియ ప్రారంభమైంది. రామాలయంలోని పర్యాటకుల వసతి కేంద్రంలో ఉన్న కాన్ఫరెన్స్ రూమ్‌లో ఈ ప్రక్రియ జరుగుతోంది. షార్ట్‌లిస్టు అయిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు కాన్ఫరెన్స్ రూమ్‌కు చేరుకున్నారు. అయోధ్య విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత ప్రతి అభ్యర్థిని సంబంధిత హోటల్స్‌కు తరలించారు. ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు ఎవరూ మీడియాతో మాట్లాడవద్దు అని ఆదేశాలు ఇచ్చారు. ఇంటర్వ్యూలు పూర్తి అయిన తర్వాత అయోధ్య విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళ్తారు. అక్కడ నుంచి తమ స్వంత ప్రదేశాలకు విమానాల్లో అభ్యర్థులు వెళ్లనున్నట్లు ట్రస్టు అధికారులు చెప్పారు.






# జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

న్యూఢిల్లీ, ఆగష్టు 11:జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 సిఫారసు చేసిన ప్రకారం ప్రాథమిక దశ కోసం జాతీయ పాఠ్య ప్రణాళిక మార్గదర్శకాలు (ఎన్‌సీఎఫ్-ఎఫ్‌ఎస్)-2022, పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్య ప్రణాళిక మార్గదర్శకాలు (ఎన్‌సీ ఎఫ్-ఎస్‌ఈ)-2023ను జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) తీసుకువచ్చింది. దశల వారీగా, సబ్జెక్టుల వారీగా పాఠ్య ప్రణాళిక లక్ష్యాలకు, సామర్థ్యాలకు, అభ్యాస ఫలితాలకు, పాఠ్యప్రణాళికకు, పాఠ్యపుస్తకాలకు, భోధనా పద్ధతులకు, మూల్యాంకనానికి అవసరమైన ఆధారాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తాయి.

జాతీయ పాఠ్య ప్రణాళిక మార్గదర్శకాలను అభివృద్ధి చేయడానికి ఒక జాతీయ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, కొత్తగా అక్షరాస్యులుగా మారినవారు, నిరక్షరాస్యులు, సబ్జెక్టు నిపుణులు, విద్యావేత్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితర విభిన్న భాగస్వాముల నుంచి జాతీయ పాఠ్య ప్రణాళిక మార్గదర్శకాల కోసం అభిప్రాయాలను సేకరించేందుకు దిగువ నుంచి పైకి విధానాన్ని అనుసరించింది. దీని కోసం ముఖాముఖి, డిజిటల్ పద్ధతుల్లో పెద్ద ఎత్తున ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను నిర్వహించారు. పౌర కేంద్రక మొబైల్ యాప్ సర్వే ద్వారా జాతీయ స్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సహా 13 లక్షలకు పైగా ఆసక్తి కలిగిన పౌరులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మొబైల్ యాప్ సర్వే ద్వారా రాష్ట్ర స్థాయిలో 1.5 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యావేత్తలు కూడా ఈ ప్రక్రియలో భాగమయ్యారు.

32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1550కి పైగా జిల్లా స్థాయి సంప్రదింపులను నిర్వహించారు. 35 విద్యా సంస్థల గ్రూపుల నుంచి, విశ్వవిద్యాలయాలు, పౌర సమూహాలతో నిర్వహించిన 12 సంప్రదింపుల్లో పాల్గొన్న 8000 మంది భాగస్వాముల నుంచి కూడా సూచనలను స్వీకరించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పాటు చేసిన ఫోకస్ గ్రూపులు 25 నిర్దిష్ట అంశాలపై 600కు పైగా అభిప్రాయ పత్రాలను రాశాయి. ఈ బృందాల్లో 4000 మందికి పైగా నిపుణులున్నారు. అలాగే ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసిన నిపుణుల బృందాల నుంచి 25 పత్రాలను స్వీకరించారు. ఈ నిపుణుల బృందాల్లో 175 మంది సభ్యులున్నారు. వీటన్నింటినీ విశ్లేషించి సంబంధిత సూచనలను ఎన్‌సీఎఫ్‌ల్లో చేర్చారు. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకొని 2022 అక్టోబర్ 20న ఎన్‌సీఎఫ్-ఎఫ్ఎస్‌ను, 2023 ఆగస్టు 23న ఎన్‌సీఎఫ్-ఎస్‌ఈను విడుదల చేశారు.

ఎన్‌సీఎఫ్‌లకు కొనసాగింపుగా నేషనల్ సిలబస్ అండ్ టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్ కమిటీ (ఎన్ఎస్‌టీసీ)ను ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ పరిధిలో అన్ని సబ్జెక్టులూ, తరగతులకూ 13 కరిక్యులర్ ఏరియా గ్రూపులు (సీఏజీలు), పాఠ్య పుస్తక అభివృద్ధి బృందాలు (టీడీటీలు) ఏర్పాటయ్యాయి. పాఠ్యపుస్తకాలతో సహా బోధన-అభ్యాస సామగ్రిని అభివృద్ధి చేసే బాధ్యతను ఎన్ఎస్‌టీసీకి అప్పగించింది. జాతీయ పాఠ్యప్రణాళికా మార్గదర్శక పర్యవేక్షణ కమిటీ (ఎన్‌వోసీ)ను కూడా ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ పాఠ్యపుస్తకాలతో సహా నూతన బోధన-అభ్యాస సామగ్రి ఎన్‌సీఎఫ్ లక్ష్యానికి అనుగుణంగా ఉండేలా పర్యవేక్షిస్తుంది. విద్యావేత్తలు, సబ్జెక్టు నిపుణులు, ప్రముఖ క్రీడాకారులు, కళాకారులు, ఉపాధ్యాయ శిక్షకులు, ఎన్‌సీఈఆర్‌టీ బోధనా సిబ్బంది, ఎస్‌సీఈఆర్‌టీల అధికారులు ఎన్ఎస్‌టీసీ, ఎన్‌వోసీ, సీఏజీల్లో ఉంటారు. విద్యావేత్తలు, సబ్జెక్టు నిపుణులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ శిక్షకులు, ఎన్‌సీఈఆర్‌టీ బోధనా సిబ్బంది, ఎస్‌సీఈఆర్‌టీ బోధనా సిబ్బంది, తదితరులు టీడీటీలో ఉంటారు. 1 నుంచి 9 తరగతులకు నూతన సిలబస్, పాఠ్యపుస్తకాలను, బాలవాటిక 1, 2, 3 కోసం జాదుయ్ పితారా, ఈ-జాదుయ్ పితారా అభ్యాస వనరుల సంకలనాన్ని ఎన్ఎస్‌టీసీ సహకారంతో ఎన్‌సీఈఆర్‌టీ తీసుకువచ్చింది.

పాఠ్య ప్రణాళిక లక్ష్యాలు, సామర్థ్యాలు, అభ్యాస ఫలితాలను సమగ్రంగా మ్యాపింగ్ చేయడం ద్వారా పాఠ్య పుస్తకాలు, అభ్యాస సామగ్రితో సహా నూతన బోధన-అభ్యాస సామగ్రి అభివృద్ధి చేశారు. ఈ ముసాయిదాలను విద్యాపరంగా, బోధనాపరంగా, భాషాపరంగా, సున్నితత్వపరంగా బహుళ సమీక్షలను చేపట్టారు. విద్యాపరమైన కచ్చితత్వం, వయసుకి తగిన విధంగా ఉండటం, సమ్మిళితత్వం, రాజ్యాంగ విలువలు, స్త్రీపురుష సమానత్వం, సాంస్కృతిక, భాషాపరమైన ఉపయుక్తత, బోధనాపరమైన అనుకూలత, ఎన్‌ఈపీ-2020, ఎన్‌సీఎఫ్-ఎఫ్ఎస్-2022, ఎన్‌సీఎఫ్-ఎస్‌ఈ-2023కి అనుగుణంగా ఉండటం లాంటి అంశాలను ఈ సమీక్ష పరిశీలిస్తుంది. ఎన్‌సీఎఫ్-ఎస్‌ఈకి కొనసాగింపుగా అభ్యాస ఫలితాల పత్రం, ఆదేశ పత్రాలు కూడా అభివృద్ధి చేశారు. ఇవి ఎన్‌సీఎఫ్-ఎఫ్ఎస్, ఎన్‌సీఎఫ్-ఎస్‌ఈలతో పాటు కొత్త సిలబస్‌లు, పాఠ్యపుస్తకాల అభివృద్ధికి మార్గదర్శకాలుగా పని చేశాయి.

పాఠ్య పుస్తకాలను ప్రతి ఏటా పునర్ముద్రించేటప్పుడు ఎలాంటి నిర్మాణాత్మక మార్పులు చేయకుండా... విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వాముల నుంచి అందిన సూచనలకు అనుగుణంగా ఎన్‌సీఈఆర్‌టీ నవీకరిస్తుంది. దీనికోసం కూడా అవసరాన్ని బట్టి మార్పులను ఖరారు చేయడానికి నిపుణులను ఎన్‌సీఈఆర్‌టీ ఆహ్వానిస్తోంది.

ఈ సమాచారాన్ని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి ఈ రోజు లోక్‌సభకు అందించిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# 'వర్క్‌షాప్ సమస్యల పరిష్కారానికి కృషి'

## -వీకే వర్క్‌షాప్ కార్మికులను కలిసిన నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య



ఖమ్మం, ఆగష్టు 11: కొత్తగూడెం ఏరియాలోని వీకే వర్క్‌షాప్‌ను నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లోని అన్ని సెక్షన్ల కార్మికులు, పిట్ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్ హెచ్ఓడీ క్రిస్టోఫర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. వర్క్‌షాప్‌లో మ్యాన్‌పవర్ పెంపు, కార్మికులకు ప్లే డేలు, పీహెచ్‌డీలు పెంపు, క్యాంటీన్ హాల్ ఏర్పాటు, ఎలక్ట్రీషియన్లకు రైన్‌కోట్లు, ప్యాంట్, షర్ట్ అందజేత, ఈఓటీ యంత్రాలను త్వరగా సమకూర్చడం వంటి డిమాండ్లను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మహిళా కార్మికుల కోసం ప్రత్యేక రెస్ట్‌రూమ్, ఇండోర్ కార్మికులకు రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గట్టయ్య విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్యలపై వర్క్‌షాప్ హెచ్ఓడీ క్రిస్టోఫర్ సానుకూలంగా స్పందించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శిగా ఎన్నికైన గట్టయ్యకు అభినందనలు తెలిపారు. వర్క్‌షాప్ సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్క్‌షాప్ ఇంజినీర్లు డీవైఎస్ఈలు శంకర్, అనిల్‌కుమార్, ఉపేందర్‌బాబు గట్టయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని సెక్షన్లకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన బ్రాంచ్ కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మధుకృష్ణ, కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్ బేరర్ గుమ్మడి వీరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుమ్మడి మురళి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ మెంగని రోషన్, పిట్ కమిటీ సభ్యులు సిద్దిరాల రాజకుమారస్వామి, పీఆర్‌సీ రెడ్డి, నరేష్, ప్రభాకర్, పరశురాములు, కస్తూరి రమేష్, అనూష, వెంకటదుర్గ, వసంతిక, రమణ, సంధ్యారాణి, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, ఈశ్వర్, మహేష్, యాకుబుద్దీన్, టీఆర్ఎస్ రాజు, రాజయ్య, బొజ్జ వెంకటస్వామి, అత్తహర్ పాషా, దుర్గ, హరీష్, సామ్యూల్ సుధాకర్, గోపాల్, వెంకట్, ఐఎస్ చిరంజీవి, సమ్మయ్య, తుమ్మల శ్రీనివాస్, మురళి, రమేష్, బాబాదిన్, కిరణ్, సలిగంటి శ్రీనివాస్, సముద్రాల శ్రీనివాస్, రహీం పాషా, ప్రకాష్, ప్రవీణ్, కళ్యాణ్, కుమార్, ఎల్లయ్య, అభిషేక్, ఉమామహేశ్వరరావు, జాన్సన్, గౌస్, అజ్గర్, రాజలింగయ్య, మోహన్, జయరాజు, చంద్రశేఖర్, చందూలాల్, యేసురత్నం, మోహన్‌లాల్, కిషన్, గోపీనాథ్, ప్రభాకర్, ట్రేడ్ అప్రెంటిస్‌లు పాల్గొన్నారు.

# పార్లమెంటు ప్రశ్న: రిజర్వు అడవుల్లో విస్తరిస్తున్న స్థానికేతర జాతుల తొలగింపు

న్యూఢిల్లీ, ఆగష్టు 11:ప్రమాదకర స్థాయిలో విస్తరించే స్థానికేతర మొక్కల జాతులను (ఏఐపీఎస్) పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ (ఎంవోఈఎఫ్‌సీసీ), దాని అనుబంధ సంస్థలు ఎప్పటికప్పుడు గుర్తించి, పర్యవేక్షిస్తున్నాయి. ఈ తరహా స్థానికేతర మొక్కలను గుర్తించేందుకు భారత అటవీ సర్వే విభాగం (ఎఫ్ఎస్ఐ) 45 రకాల విదేశీ జాతులతో కూడిన ఒక ప్రత్యేక ఆల్బమ్‌ను తయారుచేసింది. ఎఫ్ఎస్ఐ ప్రకారం, రిజర్వు అటవీ ప్రాంతాల్లో ఈ మొక్కలు చాలా దట్టంగా, మోస్తరు నుంచి దట్టంగా, అలాగే అక్కడక్కడా విస్తరించి కనిపిస్తాయి. విదేశీ జాతుల కోసం జాతీయ నిర్వహణ ప్రణాళికను తయారు చేసే వీలు కల్పించేలా అటవీ, అటవీయేతర ప్రాంతాల్లో విస్తరించిన స్థానికేతర జాతులకు సంబంధించి సమగ్రమైన, రాష్ట్రాల వారీ జాబితాను జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ (ఎన్‌బీఏ)కి బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) సమర్పించింది.

స్థానిక అవసరాలకు, ఆమోదించిన అటవీ, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికల నిబంధనలకు అనుగుణంగా రిజర్వు అడవులు, రక్షిత అటవీ ప్రాంతాల్లో విదేశీ జాతుల మొక్కల నిర్వహణ, తొలగింపుతో పాటు దేశీయ జాతి మొక్కల సాగును ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలు, సంబంధిత సంస్థలు చేపడతాయి.

సుస్థిర అటవీ నిర్వహణ పద్ధతుల ద్వారా దేశీయ/స్థానిక వృక్ష జాతుల పరిరక్షణ, పునరుత్పత్తి, పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. స్థానిక/దేశీయ వృక్ష జాతులను ఉపయోగించి అటవీకరణ, పునరుత్పత్తి చేయడం ద్వారా పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడటం, జీవావరణ సమతుల్యతను పునరుద్ధరించడం, అటవీ/వృక్ష విస్తీర్ణాన్ని పెంచాలని జాతీయ అటవీ విధానం-1988 లక్ష్యంగా నిర్దేశించింది. అదేవిధంగా, స్థానిక పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జీవావరణ వ్యవస్థ ఆధారిత అటవీ నిర్వహణను జాతీయ కార్యాచరణ ప్రణాళిక నియమాలు -2023 అందిస్తాయి. దీనిలో స్థానికేతర జాతుల నిర్వహణ, క్షీణించిన అటవీ ప్రాంతాలను పునరుద్ధరించడం, మట్టి, తేమ పరిరక్షణ చర్యలు, నీటి నిర్వహణ చేపట్టడం, పునరుత్పత్తి, పునరుద్ధరణ కార్యకలాపాల్లో నిర్దేశిత ప్రాంతానికి చెందిన దేశీయ/స్థానిక జాతులకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి ఉన్నాయి. నేలలో తేమను, భూగర్భ నీటి స్థాయిలను, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి, మొత్తంగా జీవావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ చర్యలు దోహదపడతాయి.

లోక్‌సభలో ఈ రోజు లిఖిత పూర్వకంగా అందించిన సమాధానంలో పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ ఈ సమాచారాన్ని వెల్లడించారు.

# 2015లో... 523 ఆసియా సింహాలు, 2025 నాటికి 891 అటవీ అధికారులు, సంరక్షకులు, స్థానిక ప్రజల అంకిత భావానికి సూచిక: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 11:'2026 ప్రపంచ సింహాల దినోత్సవం' సందర్భంగా సింహాల సంరక్షణలో భారత్ సాధిస్తున్న అసాధారణ ప్రగతిని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రశంసించారు. వన్యప్రాణులనీ, జీవ వైవిధ్యాన్నీ పరిరక్షించడానికి దేశం కనబరుస్తున్న తిరుగులేని నిబద్ధతను మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

2015లో 523 ఆసియా సింహాలు ఉంటే, 2025లో అవి 891కి వృద్ధి చెందాయని సామాజిక మాధ్యమ సందేశంలో మంత్రి తెలిపారు. ఈ ఘనత అటవీ అధికారులు, సంరక్షకులు, స్థానిక ప్రజలతో పాటు సింహ జాతులను సంరక్షించడానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరిదీ అని ఆయన అన్నారు.

ఆసియా సింహాల సంరక్షణలో భారత్ సాధించిన ఈ విజయం వన్యప్రాణి, జీవవైవిధ్య సంరక్షణ పట్ల భారత్ కనబరుస్తున్న నిబద్ధతకు నిదర్శనమని శ్రీ యాదవ్ అన్నారు. భారత ప్రాకృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తామన్న సంకల్పాన్ని ఆయన పునరుద్ఘాటిస్తూ, ఆసియా సింహాల జాతుల సంరక్షణ దిశగా రాబోయే తరాల వారికి కూడా స్ఫూర్తిని అందిస్తుందన్నారు.

కీలక ఆవాసాలను పరిరక్షించడం, సంరక్షణ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయడం, వన్యప్రాణుల మనుగడకు భద్రత కల్పించడం వంటి కార్యక్రమాల ద్వారా అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని ప్రపంచానికి భారత్ చాటిచెప్పిందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ అన్నారు. ఈమేరకు ఆయన ఒక సందేశాన్ని సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచారు.

పులులు, సింహాల సంరక్షణను దీర్ఘకాలిక ప్రాతిపదికన నిర్ధారించడానికి 'ప్రాజెక్ట్ లయన్'ను అమలు చేయనున్నట్లు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2020 ఆగస్టు 15న ప్రకటించారు. సింహాలు సంచరిస్తున్న వన్య ప్రాంత పరిధి 2020లో సుమారు 30,000 చ.కి.మీ. ఉండగా, ప్రస్తుతం దాదాపు 35,000 చ.కి.మీ.కి విస్తరించింది.

# సభలో సంయమనం..

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందన

నల్గొండ, ఆగష్టు 11:కమలాపూర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. సభలో ఉద్రిక్తతకు అవకాశం ఉన్నప్పటికీ మంత్రి సంయమనం పాటించారని పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగిస్తుండగా స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను ప్రస్తుత ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరుతూ ఆయన వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహానికి గురికాకుండా తన ప్రసంగాన్ని కొనసాగించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు సమాధానం ఇస్తూనే సభను ప్రశాంతంగా కొనసాగించేందుకు ప్రయత్నించారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా సభ కొనసాగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతసేపు ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. మంత్రి సంయమనం పాటించడంతో పరిస్థితి అదుపులోనే కొనసాగిందని పలువురు పేర్కొన్నారు.

మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం సరైన పద్ధతి కాదని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. తమ అభిప్రాయాలను ప్రత్యేకంగా మాట్లాడే సమయంలో వెల్లడించాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమం చివరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగిసింది.

# కొలనూరులో దాతలతో శివాలయం అభివృద్ధి పనులు.. ప్రారంభించిన వేద పండితుడు అశోక్

కరీంనగర్, ఆగష్టు 11: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూరు గ్రామంలోని పునరుద్ధరణ జరుగుతున్న శివాలయంలో విరాళాధాతలతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ అతి పురాతనమైన సాంబ సదా శివాలయం శిథిలావస్థకు చేరుకుని ఆలయ శఖలాలు కూలిపోయాయి. దీంతో గ్రామస్తులు విరాళాలతో రాతి కట్టడంతో ఆలయాన్ని ఆలయాన్ని యథాతథంగా పునరుద్ధరిస్తున్నారు.

దాదాపు రూ.కోటి యాభై లక్షలతో ఆలయ పునర్నిర్మాణం చేపడుతుండడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయం చుట్టూ సీసీతో ఫ్లోరింగ్ పనులు ప్రారంభించారు. వేద పండితుడు నందగిరి అశోక్ పూజా కార్యక్రమం చేపట్టారు. కాగా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు బండారి ఐలయ్య యాదవ్, ముస్త్యాల నాగయ్య, ఓదెల నరేందర్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో మరో అక్రమ మాదక ద్రవ్యాల తయారీ కేంద్రాన్ని గుర్తించిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 11:మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ తయారీ, అంతర్జాతీయ రవాణాను నిరోధించే నిరంతర ప్రయత్నాల్లో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) మరో విజయం సాధించింది. షెడ్యూల్డ్ సైకోట్రోపిక్ పదార్థమైన ట్రామాడోల్ హైడ్రోక్లోరైడ్ మాత్రలను ఆఫ్రికా దేశాలకు రవాణా చేయడం కోసం రహస్యంగా తయారు చేయడం, దాచిపెట్టడం, అక్రమంగా ఎగుమతి చేయడంలో పాలుపంచుకుంటున్న ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను డీఆర్ఐ సమర్థంగా అడ్డుకుంది. వారం రోజుల నిఘా ఆధారంగా జరిగిన ఈ ఆపరేషన్‌లో, లక్ష ట్రామాడోల్ హైడ్రోక్లోరైడ్ మాత్రలు, లక్ష టాపెంటాడోల్ మాత్రలు, సైకోట్రోపిక్ పదార్థాల రహస్య తయారీలో ఉపయోగించే యంత్రాలు, ముడి పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఈ సిండికేట్‌కు చెందిన ముగ్గురు కీలక సభ్యులనూ అరెస్టు చేశారు.

ఈ నెల 2న అందిన నిఘా సమాచారం ఆధారంగా చేపట్టిన ఒక ఆపరేషన్‌లో, ముంబయి ఎయిర్ కార్గో కాంప్లెక్స్ వద్ద నైజీరియాకు ఎగుమతి చేసేందుకు ఉంచిన సరుకును డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ఈ సరుకులో 'ప్రెగాబాలిన్-300 ఎంజీ క్యాప్సూల్స్' ఉన్నట్లుగా అధికారులు ప్రకటించారు. పూర్తిస్థాయి పరిశీలన ద్వారా, ఆ సరుకులో దాచి ఉంచిన 1 లక్ష 'ట్రామాడోల్ హైడ్రోక్లోరైడ్' టాబ్లెట్లు (250 ఎంజీ, సుమారు 25 కిలోల బరువు)తో పాటు 1 లక్ష 'టాపెంటాడోల్' మాత్రలూ (200 ఎంజీ, సుమారు 20 కిలోల బరువు) ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

డీఆర్ఐ జరిపిన వేగవంతమైన దర్యాప్తులో, పలు దశల్లో పనిచేస్తున్న ఒక వ్యవస్థిత అక్రమ సరుకు రవాణా వ్యవస్థను అధికారులు గుర్తించారు. మహారాష్ట్రలోని అంబర్‌నాథ్‌లో ఉన్న ఒక ఫ్యాక్టరీలో ట్రామాడోల్ మాత్రలను రహస్యంగా తయారు చేసి, వాటి గుర్తించే వీలులేకుండా సాదా కార్టన్‌లలో ప్యాక్ చేస్తున్నారు. ఆ తర్వాత ఆ సరుకును ముంబయి ఎయిర్ కార్గో కాంప్లెక్స్ సమీపంలోని ఒక గిడ్డంగికి తరలించి, అక్కడ వాటిని తెల్లటి గోనె సంచుల్లో తిరిగి ప్యాక్ చేసి, నైజీరియాకు అక్రమంగా ఎగుమతి చేయడానికి సిద్ధం చేశారు.

వారం రోజుల పాటు పూర్తి సమన్వయంతో నిర్వహించిన దాడుల ద్వారా... ఎగుమతిదారు, తయారీదారు, సరఫరాదారు, రవాణాదారు, నిల్వ గిడ్డంగికి సంబంధించిన పలు ప్రదేశాల్లో డీఆర్ఐ అధికారులు సోదాలు నిర్వహించారు. తయారీ కేంద్రంలో జరిపిన సోదాల్లో సైకోట్రోపిక్ పదార్థాల రహస్య తయారీలో ఉపయోగించే టాబ్లెట్ కంప్రెషన్ యంత్రాలు సహా, గణనీయ పరిమాణంలో ముడి పదార్థాలనూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా ఐఈసీ హోల్డర్/ఎగుమతిదారు, సరఫరాదారు-కమ్-కోఆర్డినేటర్, ట్రామాడోల్ టాబ్లెట్ల రహస్య తయారీదారు సహా ముగ్గురు కీలక నిందితులను అరెస్టు చేశారు.

ట్రామాడోల్, టాపెంటాడోల్ అనేవి సింథటిక్ ఓపియాయిడ్ అనాల్జెసిక్ ఔషధాలు. వీటిని మధ్యస్థం నుంచి తీవ్రమైన నొప్పిని తగ్గించడానికి వైద్యుల పర్యవేక్షణలో విస్తృతంగా ఉపయోగిస్తారు. దుర్వినియోగం చేసేందుకు అవకాశం, వ్యసనానికి దారితీసే ప్రమాదం కారణంగా... ఈ రెండు ఔషధాలు కఠినమైన నియంత్రణలకు లోబడి ఉంటాయి. ట్రామాడోల్‌ను నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌పీడీఎస్) చట్టం-1985 కింద సైకోట్రోపిక్ పదార్థంగా నోటిఫై చేశారు. టాపెంటాడోల్‌ను ప్రస్తుతానికి ఎన్‌పీడీఎస్ చట్టం షెడ్యూల్‌లో చేర్చనప్పటికీ... డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం ఇదీ కఠిన నియంత్రణలకు లోబడి ఉంది. ఈ ఔషధాల అక్రమ తయారీ, మళ్లింపు, అక్రమ రవాణా ప్రజారోగ్యానికి తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయి. తరచుగా వ్యవస్థీకృత అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లతో ఇవి సంబంధం కలిగి ఉంటాయి.

ఈ ఆపరేషన్ ద్వారా సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ తయారీ, నిల్వ, దాచిపెట్టడం, ఎగుమతి చేసే ప్రయత్నాల్లో పాలుపంచుకున్న ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను డీఆర్ఐ సమర్థంగా ఛేదించింది.

# పోలీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి

## -నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం మున్సిపాలిటీ చొరవ తీసుకోవాలి
## -మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ప్రజా జాగృతి సమితి విజ్ఞప్తి




నల్గొండ, ఆగష్టు 11:పోలీసు శాఖలో ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజా జాగృతి సమితి డిమాండ్ చేసింది. సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజలింగు మోతె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హత, ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు యువత పోలీసు ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా భావించి వెంటనే ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాత పరీక్షకు శిక్షణతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, వారానికోసారి మాక్ టెస్టులను కూడా ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కోచింగ్ ప్రారంభిస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, మున్సిపాలిటీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు వేల్పుల వెంకటస్వామి, రామిళ్ల మల్లేష్, ఎట్టం లచ్చయ్య పాల్గొన్నారు.

# పెర్కపల్లెలో భూవివాదం.. ఉద్రిక్తత

## -సర్వే చేసి న్యాయం చేయాలని డిమాండ్

ఆదిలాబాద్, ఆగష్టు 11:నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం పెర్కపల్లె గ్రామంలో భూవివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి ఓ వర్గం వారు వచ్చి దౌర్జన్యానికి పాల్పడి, పంటను ధ్వంసం చేయడంతో పాటు పశువుల మందను పొలంలోకి తోలారని బాధిత రైతు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామానికి చెందిన గోపు లచ్చవ్వకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో ఆమె కుటుంబం 50 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే తాజాగా గ్రామానికి చెందిన ఓ వర్గం వారు ఆ భూమి గతంలో పార్వతి లచ్చగౌడ్‌కు చెందినదంటూ వివాదానికి దిగారని లచ్చవ్వ పేర్కొన్నారు.

అంతటితో ఆగకుండా తన పొలంలో వేసిన వరి నాటును పూర్తిగా ధ్వంసం చేశారని, అనంతరం కాలనీకి చెందిన పశువుల మందను ఉద్దేశపూర్వకంగా పొలంలోకి తోలడంతో పంటకు మరింత నష్టం వాటిల్లిందని ఆమె ఆరోపించారు.



# క్రీడలతో ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం

హన్మకొండ, ఆగష్టు 11:(నేటినిజం ప్రతినిధి) క్రీడలతో ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఏ సర్కిల్ జట్టు విజయం సాధించినా అది సంస్థ విజయమేనని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఉద్యోగులందరూ ఒకే కుటుంబంలా భావించి క్రీడా స్ఫూర్తితో, ఆరోగ్యకరమైన వాతావరణంలో పోటీపడాలని సూచించారు.

మంగళవారం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి నూతనోత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు, అనుబంధం పెరిగినప్పుడే సంస్థ పట్ల అంకితభావం పెరుగుతుందని, తద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ సర్కిళ్లకు చెందిన 150 మందికి పైగా క్రీడాకారులు పోటీపడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంస్థ ప్రతిష్ఠను పెంచేలా ప్రతి ఏడాది క్రీడలు, సాంస్కృతిక పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్వయంగా క్యారమ్స్ ఆడి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. డైరెక్టర్లు వి. మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, చీఫ్ ఇంజినీర్లు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు మాధవరావు, వేణుబాబు, హేమంత్‌కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్. జగన్నాథ్, సభ్యులు ప్రేమ్‌కుమార్, యాకుబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్న బుద్ధా వెంకన్న

అమరావతి, ఆగష్టు 11:ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటినీ సందర్శించారు. స్థానికులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటేనే వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అవకాశం ఉంటుందన్నారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, వారి సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

# తల్లి-శిశువు రక్షణకు ప్రభుత్వం మరో ముందడుగు

అమరావతి, ఆగష్టు 11: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న 102 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ (డ్రాప్ బ్యాక్) సేవలను మంగళవారం రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభించారు. పోలవరం జిల్లాకు కేటాయించిన నాలుగు వాహనాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి మాట్లాడుతూ గిరిజన, గ్రామీణ, దూర ప్రాంతాల్లో నివసించే గర్భిణీలు, ప్రసూతి తల్లులు రవాణా సమస్యల కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు తల్లి, శిశువు ఆరోగ్య రక్షణకు ఈ సేవలు ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని సొళ్ళ బొజ్జి రెడ్డి తెలిపారు. తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు పూర్తిగా ఉచితంగా అందించ బడటం వల్ల పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని, ఈ వాహనాలను ప్రజలు సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులు, నవజాత శిశువులను సురక్షితంగా, సమయానుకూలంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ సేవల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రసవానంతరం తల్లులు, నవజాత శిశువులు సురక్షితంగా ఇంటికి చేరడం ఆరోగ్య పరిరక్షణలో కీలక అంశమని చెప్పారు. 102 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల ద్వారా ప్రభుత్వ వైద్య సంస్థల నుండి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వరకు రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా ప్రసూతి అనంతర సమస్యలను తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు.

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ఇతర వైద్య సంస్థల్లో ఈ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేపట్టాలని, సేవల అమలులో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని దినేష్ కుమార్ సూచించారు. ఈ 102 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఆధునిక సౌకర్యాలతో పరికరాలతో ఈ వాహనం డిజైన్ చేయడం ఆయన తెలిపారు. ఎక్కడైనా అత్యవసర సేవల కొరకు కాల్ సెంటర్ సంప్రదించి తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ ను పోలవరం జిల్లాలోని గర్భిణీ స్త్రీలు సద్వినియోగపరచుకోవాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి, మైనార్టీ సెల్ డైరెక్టర్ షేక్ సుభాని,డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి. సరిత,డి సి హెచ్ ఎస్ సాంబశివరావు, జిల్లా మలేరియా అధికారి భాస్కర్, తాసిల్దార్ సిహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఉమ్మడి ప్రభుత్వ నాయకులు అడబాల బాపిరాజు,పి శ్రీనివాసరావు, స్వప్న కుమారి,వై నిరంజని దేవి , వెంకన్న బాబు, గణపతి, రమణ,జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.పి. సరిత, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్తలు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

## -సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
## -సిబ్బంది సమయపాలన పాటించి బాధ్యతగా విధులు నిర్వహించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, ఆగష్టు 11:సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉంటున్న చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత, అవసరమైన సంరక్షణ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, బాల సదనం పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రంతో పాటు పెద్దపల్లిలోని రంగంపల్లి బాల రక్షక భవన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి సౌకర్యాలు, సిబ్బంది విధుల నిర్వహణ, వంటశాలలు, డార్మిటరీలను పరిశీలించారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయానికి విధులకు హాజరై, తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి సాయిలో నిర్వహించాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. బాల రక్షక భవన్‌లో చిన్నారుల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించిన ఆయన.. పోక్సో కేసుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలలపై లైంగిక వేధింపులు, హింస ఘటనలు జరిగినప్పుడు బాధితులకు సకాలంలో రక్షణ, సహాయం, కౌన్సెలింగ్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని, భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అవసరమైన సేవలు అందేలా చూడాలని ఆదేశించారు.





You are Cordially invited to the
Book Releasing function of

"KOMARAM BHEEM", "THE BOND", "BANDHAM"
Novels by: Sri S.M. Pran Rao

On 13th August, 2026 at 4:00 pm

Venue: Bhagawan Mahaveer Auditorium,
State Museum, Public Gardens, Hydeerhad

President: Prof. R. Sayanna, Former Vice Chancellor, Kakatiya University
Chief Guest: Prof. Kodandaram, Hon'ble MLC
Eminent Guest: Prof. K. Arjun Rao, Director, Dept. of Heritage Telangana (Formerly Archaeology & Museums)

Guests of Honor:
Prof. Pruthviraj, Former Registrar, Dr. BRAOU, Hyd
Sri Allani Sridhar, Popular Cine Director
Sri Chintapatla Sudarshan, Popular Writer & Critique
Sri Koora Chidambaram, Popular Writer & Critique
Sri S.M. Pran Rao, Writer

Invited by
Naresh Kaluvakota
Convenor

The Students of Sri S.M. Pran Rao (1973-76 batch GJC, Nizamabad)

